# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- అన్నమయ్య జిల్లా పేరంపల్లిలో యాసిడ్ దాడికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు.

- విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు.

- కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమతుల్యంగా ముందుకు వెళుతోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు.

==========================

అన్నమయ్య జిల్లా పేరంపల్లి గ్రామంలో యువతిపై యాసిడ్ దాడి చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. యాసిడ్ దాడి ఘటనపై జిల్లా ఎస్పీతో మాట్లాడిన రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత బాధితురాలని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించాలని ఆదేశించారు. యాసిడ్ దాడికి గురై మదనపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలని, వారి తల్లిదండ్రులను రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళలపై యాసిడ్ దాడులకు పాల్పడే వ్యక్తులను కఠినంగా శిక్షిస్తామన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ఉండేందుకు మహిళలు ముందస్తు జాగ్రత్తగా పోలీసులను ఆశ్రయించాలన్నారు. కాగా అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం, పేరంపల్లి గ్రామంలో ఓ యువకుడు యువతి తలపై కత్తితో గాయపరిచి ముఖంపై యాసిడ్ పోయడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి మెరుగైన వైద్యం కోసం బెంగుళూరుకు తరలించారు.

=========================

ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం ఆర్థిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఈరోజు అనంతపురం జిల్లా గార్లదిన్నెలోని  ఏపీ మోడల్ స్కూల్ లో నిర్వహించిన పాఠశాల విద్యార్థుల ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జి.వీరపాండియన్, జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ లతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో  మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పాఠశాల విద్యార్థులకు  ఉచిత కంటి అద్దాల పంపిణీ ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు. కంటి సమస్యలున్న 20 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా.. వారిలో కంటి అద్దాలు అవసరమైన 90 వేల మందికి కంటి అద్దాలను ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందని మంత్రి తెలుపుతూ...

(వాయిస్ 21 సెకన్లు)

=========================

ఈ కిసాన్ వాణి ప్రసారాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీన రేడియో కిసాన్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. దీనిలో భాగంగా రేడియో కిసాన్ దినోత్సవాన్ని రేపు ఆకాశవాణి కర్నూలు కేంద్రం ఆవరణంలో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ap community managed natural farming chief technology and innovation officer డాక్టర్ వి. లక్ష్మీనాయక్, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. జాన్సన్, విశిష్ట ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. జిల్లాలోని రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని వ్యవసాయ, సాంకేతిక విషయాలపట్ల అవగాహన కలిగించుకోవాల్సిందిగా ఆకాశవాణి కర్నూలు కేంద్రం కార్యక్రమ సహాయ సంచాలకులు దేవర బొట్ల మురళి ఒక ప్రకటనలో తెలియజేశారు.

=========================

విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్దికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఈరోజు ఒంగోలులో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం త్వరలో కీలక నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని విశాఖ స్టీల్ ప్లాంట్కి 11 వేల 400 కోట్ల రూపాయల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం కేటాయించిందని గుర్తు చేశారు. దేశంలో అత్యున్నతమైన విశాఖ స్టీల్ ప్లాంట్ని నష్టాల్లో నుంచి లాభాల్లోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధే అజెండాగా పని చేస్తున్నాయన్నారు.

విరామం

=========================

కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమతుల్యంగా ముందుకు వెళుతోందని రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా సంజామల మండలంలో 12.58 కోట్ల రూపాయల నిధులతో రోడ్డు నిర్మాణానికి ఈరోజు మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 1,081 కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల గుంతలను పూడుస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పలు గ్రామాల్లో సిసి రోడ్లు దాదాపుగా పూర్తి చేశామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=========================

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద చేపడుతున్న గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కురుపాం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. అనంతరం జీడి రైతులతో మాట్లాడిన కలెక్టర్ జీడి పంటను సాగుచేసేందుకు జిల్లా అనుకూలమని, ఈ పంటతో రైతులకు రెట్టింపు ఆదాయం లభిస్తుందని అన్నారు. వన్ ధన్ వికాస కేంద్రాల ద్వారా విక్రయాలు చేపట్టి అధిక లాభాలు పొందాలని కలెక్టర్ సూచించారు. అలాగే మంతినవలస గ్రామంలో పిఎంఏపై గ్రామీణ్ పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న 9 గృహాలను కలెక్టర్ సందర్శించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద కురుపాంలో సోలార్ విద్యుత్ ను ఏర్పాటు చేసుకున్న లబ్ధిదారు ఇంటిని సందర్శించి, ప్రతీ ఒక్కరూ సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతిని సందర్భంగా ఆయనకు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన సంజీవయ్య జీవిత ప్రస్థానం స్ఫూర్తిదాయకం ఆదర్శణీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఆయన జయంతి వేడుకలు అధికారికంగా జరుపుకోవడం తెలుగు జాతికి గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

దామోదరం సంజీవయ్య స్ఫూర్తి, ప్రేరణతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలను వేసి నివాళి అర్పించారు.

అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సంజీవయ్యా జయంతి వేడుకల్లో సంయుక్త కలెక్టర్ టి.నిషాంతి పాల్గొన్నారు. దామోదరం సంజీవయ్య పారిశ్రామికాభివృద్ధికి, భూసంస్కరణల అమలు వంటి ఎన్నో నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టారన్నారు.

అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయులని విజయనగరం సంయుక్త కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కొనియాడారు. దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

==========================

పోలీసింగ్ లో ప్రజలను భాగస్వాములను చేస్తూ.... సాంకేతికతను ఉపయోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నమని విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్. వి రాజశేఖర్ బాబు అన్నారు. విజయవాడలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఇన్‌గ్రామ్ ఇండియా మొబైల్ ప్రైవేటు లిమిటెడ్ గోడౌన్ నుంచి చోరికి గురైన 2 కోట్ల రూపాయల మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ చోరీతో సంబంధం ఉన్న ఆరుగురు నిందితులను బిహార్ సరిహద్దుల వద్ద పోలీసులు పట్టుకున్నారని ఆయన వెల్లడించారు.

==========================

నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్థిక విభాగం ఆధ్వర్యంలో “వ్యాపార విశ్లేషణలో ఆధునిక పోకడలు” అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి కార్యశాలను ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా మాట్లాడుతూ... ప్రతిరోజూ నూతన సాంకేతికత ఆవిష్కారమౌతోందని అన్నారు. కృత్రిమ మేధను (ఏఐ) అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉన్నా కూడా, దానిని ఎంత మేరకు వినియోగించుకోవాలి అనే దానిపై అనేక సమస్యలు ఉన్నాయని, విద్యార్థులు దీనిని గమనించాలని ఆయన కోరారు.

==========================
==========================